-మారగాని రాంబాబు-
1-257, భవానీపేట,
పులివెందుల-516 390
కడప - జిల్లా.

# తల దన్నే వాడు



కడప బస్టాండు ప్రయాణీకులతో కిటకిట లాడుతోంది. బస్సులు వస్తున్నాయి పోతున్నాయి. ప్రియాంక, మాధురిలు ఎక్కవల్సిన బస్సు అరగంట ఆలస్యంగా నిండు గర్భిణిలా వచ్చింది.

అంత వరకూ వేచి ఉన్న ప్రయాణీకులు ఆరోజే రిలీజయిన సిన్మా కోసం ఎగబడినట్లుగా సీటు కోసం అత్యవసర దారిగుండా, మరికొందరు డ్రైవర్ డోర్ నుండి లోపలికి ప్రవేశించటం మొదలెట్టారు.

ప్రియాంక మాధురికి లగేజి అప్పగించి చాకచక్యంగా కర్చీఫ్‌ని సీట్లోకి వేసింది.

రష్‌గా ఉండటంతో సీటందింది కదా అని నిదానంగా ఎక్కిన ప్రియాంక మాధురిలకు తాము కర్చీఫ్ వేసిన సీట్లో రవీ, రామ్‌లు దర్జాగా కూర్చోవటంతో కోపం వచ్చింది!

అంత వరకూ బస్టాండు రోమియోల్లా అసభ్య పదాలతో అల్లరి చేసింది కాక సీటు కూడా ఆక్రమించుకోటం కోపాన్ని తెప్పించింది!

"ఏయ్ మిస్టర్! ఈసీటు మాది-లేవండి" అంది ప్రియాంక కోపంగా.

"ఆహా ఏదీ ఇక్కడ రాసి ఉందా! మీదనీ.." అన్నాడు రామ్ హేళనగా నవ్వుతూ.

"ఇక్కడ కర్చీఫ్ ముందు మేమేశాము" అంది మాధురి.

"ఉంటే చూపించు" అన్నాడు రవి.

బస్సు ఒక్కకుదుపు ఇచ్చి బయలుదేరింది. ఇలాంటి వాళ్ళతో వాదన పెట్టుకునే కన్నా నిల్చుని ప్రయాణం చేయటం మేలని నిర్ణయించుకున్నారు.

వాళ్ళ అవస్థ గమనించిన వ్యక్తి తన భార్యను సర్దుకోమని చెప్పి వాళ్ళకి సీటిచ్చాడు.

ఆడ పిల్లలిద్దరికీ.. భలే టోకరా ఇచ్చాం...

ఇక హాయిగా ప్రయాణం చేయవచ్చు అనుకున్నారు మిత్రులిద్దరూ.

కానీ అపుడే.."ఎక్స్‌క్యూజ్‌మీ లేచి సీటిస్తారా!" అన్న పిలుపు వినపడ్డంతో అటువైపు చూశారు రవీ, రామ్‌లు.

చేతికర్ర సాయంతో ఒకవ్యక్తి ఒంటికాలిపై నిల్చుని ఉన్నాడు.

అతనికి సాయంగా పక్కనే మరోవ్యక్తి ఉన్నాడు.

"మేము కూర్చున్నది కనపడ్డం లేదా? ఎందుకివ్వాలి సీటు?" ప్రశ్నించాడు రవి.

"దయచేసి అటు చూడండి" అన్న వ్యక్తి మాటలతో.. తలతిప్పిన మిత్రులిద్దరికి 'వికలాంగులకు' అని రాసి ఉండటంతో.. లేవక తప్పలేదు.

దిగవల్సిన స్టేజీ వచ్చింది.

"ఒరేయ్ ఈ హేండ్‌స్టిక్‌తో పనిలేదు.. దాన్ని ప్యాక్‌చేయి! తాతయ్య కోసం కొన్న ఈ చేతికర్ర.. మనకి భలేగా ఉపయోగపడిం దిరా" అంటూ తన పక్కనున్న వ్యక్తితో ఏ సాయం లేకుండా చకచకా నడుచుకుంటూ వెళ్తోన్న నల్ల కళ్ళజోడు పెట్టుకున్న వ్యక్తిని చూసి బిత్తరపోయారు రవీ, రామ్‌లు.

ఇదంతా గమనించిన ప్రియాంక.

"అవిటివాడిలా నటించి భలేదెబ్బ కొట్టాడు.. తగినశాస్తి జరిగింది వెధవలకి" అంది మాధురితో.. తన మాటలు రవికీ, రామ్‌కీ మాత్రమే వినపడేట్లుగా...

